క్లుప్తంగా

రేషన్ డీలర్లకు గౌరవవేతనం ఇవ్వాలి



పరకాల/దామెర: రేషన్ డీలర్లకు గౌరవవేతనం ఇవ్వాలని డీలర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.5వేల గౌరవవేతనం అందజేయాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో దామెర మండల అధ్యక్షుడు సదిరం పోశాలు, వివిధ మండలాల అధ్యక్షులు వాణి రాజు, శంకర్ రావు, రాజేందర్ రెడ్డి, ఉమేందర్ గౌడ్, సర్వేశం, పోచయ్య తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



బుర్ర సరిత(ఫైల్)

ఐనవోలు: రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన ఘటన మండలంలోని లింగ మోరిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బుర్ర సరిత(38) అనారోగ్య కారణాలతో తీవ్రంగా బాధపడుతుండేది. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సరితకు భర్త శ్రీహరి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి తండ్రి వడ్లకొండ కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆస్పత్రి వద్ద టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాయకులు మారెపల్లి వెంకట్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



దామెర: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని పులుకుర్తిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జానపట్ల భద్రయ్య తన వ్యవసాయ క్షేత్రం సమీపంలో దుక్కిటెద్దులను మేత కోసం వదిలాడు. కాగా అందులో ఒకటి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైర్ తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో రూ.90వేల నష్టంవాటిల్లిందని అధికారులు ఆదుకోవాలని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. కాగా విషయం తెలుసుకున్న ఏఈ గుర్రం రమేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాట్రపల్లిలో మిషన్ సంబురాలు



శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని సీఎస్ఐ మిషన్ ఏడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కాట్రపల్లి మిషనరీ ఇన్‌చార్జ్ రెవరెండ్ సామ్ జార్జ్ అయ్యగారు పాల్గొని మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా కాంట్రపల్లితోపాటు చుట్టూ ప్రక్కల గ్రామాల్లో ఉన్న పిల్లలకు విద్య, వైద్యాన్ని అందిస్తూ ఎంతో మందికి ఉపయోగకరంగా ఉండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పరకాల పాస్టర్ ప్రకాశం, గుడెపాడ్ పాస్టర్ సామెల్, శాయంపేట పాస్టర్ అనిల్‌కుమార్, కొప్పుల పాస్టర్ రూబెన్, పత్తిపాక పాస్టర్ ఏసుపాదం, బాబు, బిజాయి మాథ్యూ పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు మాక్ టెస్ట్

హన్మకొండ చౌరస్తా: షైన్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో గ్రూప్ -2కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రాండ్ మాక్ టెస్ట్ సిరీస్‌ను ఆదివారం నిర్వహించారు. సుమారు 300 మంది పరీక్ష రాసినట్లు ఇన్‌స్టిట్యూట్ బాధ్యుడు సయ్యద్ తెలిపారు. కరుణకుమారి, పురుషోత్తం, రాజేష్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో..?

- పెడ్లు.. అద్దె భవనాల్లో జీపీ కార్యకలాపాలు
- నిధుల కొరతతో నిలిచిన భవనాల నిర్మాణ పనులు
- బండతండాలో శిలాఫలకానికే పరిమితం
- కన్నారంలో శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ కార్యాలయం



కన్నారం గ్రామంలో బేస్‌మెంట్ దశలోనే ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణం

వేలేరు: మండలంలో నూతనంగా ఏర్పడిన తండాలు, గ్రామాలకు పంచాయతీ కార్యాలయాలు లేక పోవడంతో అద్దె భవనాలు, షెడ్లలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో కొత్తగా గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాలను కలిపి గొల్లకిష్టంపల్లి కేంద్రంగా గ్రామపంచాయతీని ఏర్పాటు చేశారు. అలాగే చింతలతండా, లోక్యాతండా, బండతండా, కన్నారం గ్రామాలకు నూతన గ్రామ పంచాయతీ భవనాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం కన్నారం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అందులోనే అధికారులు పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కన్నారం, గొల్లకిష్టంపల్లి గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, చింతలతండా, లోక్యాతండా, బండతండా గ్రామాలకు ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్టీఎస్‌డీఎఫ్) కింద ఒక్కో పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.20లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. దీంతో అప్పటి ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, సతీశ్‌కుమార్ పక్కా భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా కొన్ని గ్రామాల్లో అప్పటి సర్పంచులే పనులు చేపట్టారు. కొంతమంది సర్పంచులు తమ అనుచరులను ముందుపెట్టి పనులు చేయించారు. కానీ ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కేవలం చింతలతండా జీపీలోనే 70 శాతం పనులు పూర్తయ్యాయి. గొల్లకిష్టంపల్లి, లోక్యాతండా గ్రామాల్లో నిర్మాణ పనులు స్లాబ్ వరకు చేరాయి. కన్నారంలో ఇంకా బేస్‌మెంట్ దశలోనే మూలుగుతోంది. బండతండా గ్రామంలో పనులు ఇంకా ప్రారంభించనే లేదు.



షెడ్డులో బండాతండా జీపీ కార్యాలయం



అసంపూర్తిగా ఉన్న లోక్యాతండా భవనం

పనులు పూర్తి చేయాలి



కన్నారం గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రెండు సంవత్సరాల క్రితం అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి బేస్‌మెంట్ లెవల్ వరకు పని చేసి బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేశాడు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వెంటనే భవన నిర్మాణపనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలి

– జన్ను రవి, కన్నారం గ్రామస్తుడు

పనులు ముందుకు సాగడం లేదు



గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. నిధుల కొరత కారణంగా బిల్లులు రావడం లేదని పనులు మధ్యలోనే వదిలేశారు. సమయానికి నిధులు అందక కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. గత సర్పంచులు ఐదేళ్లు అద్దె భవనాల్లోనే పాలన కొనసాగించారు. ఈసారైనా సొంతభవనాల్లో పాలన సాగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బత్తుల శ్రీనివాస్, గొల్లకిష్టంపల్లి

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఎల్కతుర్తి: లోక్ అదాలత్‌ను మండల ప్రజలు వినియోగించుకోవాలని ఎస్సై గోదారి రాజ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాల్లో గట్టు పంచాయతీలు, సివిల్ పంచాయతీలు, వివిధ కేసులు నమోదైనవారికోసం ఈనెల 23నుంచి 28వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఇరుపక్షాలు రాజీపడితే కేసు కొట్టివేస్తారని తెలిపారు. గ్రామాల్లో కక్షలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు లోక్ అదాలత్ ఉపకరిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే డ్రంకెన్‌డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ కేసు, మైనర్ డ్రైవింగ్ కేసులో వాహనం సీజ్ చేయబడితే సోమవారం నుంచి శనివారం వరకు వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో పాల్గొని కేసులను క్లోజ్ చేసుకోవాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులున్న వారు ఆధార్‌కార్డు జిరాక్స్, వాహన పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ కేసులున్న వారు ఆధార్‌కార్డు, మీసేవలో దరఖాస్తు చేసుకున్న రశీదు వెంట తీసుకెళ్లాలని చెప్పారు. మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించి కేసులు ఉన్న వారు బర్త్ సర్టిఫికెట్, ఎస్సెస్సీ మెమో తీసుకెళ్లాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానాతో కేసులు కొట్టివేయబడుతాయని వెల్లడించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షిస్తున్న వైద్యులు

దామెర: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వీణా మెడికేర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ డాక్టర్ అశోక్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల కారణంగా కీళ్ల, ఎముకల నొప్పులతో ఎక్కువ శాతం మంది బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రత్తంగా ఉండాలని సూచించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఫౌండేషన్ చైర్మన్ గురిజాల శ్రీరాంరెడ్డి, డాక్టర్ రాకేశ్, డాక్టర్ సంతోశ్, డాక్టర్ మానస, వేల్పుల రాజ్‌కుమార్, హాస్పిటల్ మేనేజర్ శివ, రామనాథం, రాకేశ్, హాస్పిటల్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు జీఓను ఉపసంహరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే ప్రపంచ బ్యాంకు షరతుల మేరకు పనిచేస్తూ విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేలా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓ అశాస్త్రీయంగా ఉందన్నారు. జీఓ నంబర్ 25 ప్రకారం 60మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లే ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, జిల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ తెరిపించండి



నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

ఐనవోలు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్‌ను రిపేర్ చేయించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీపీ అధికారులను ఎన్నిసార్లు కోరినా.. సాకులు చెబుతూ కాలం వెల్లదీస్తున్నట్లుగా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఇష్టారీతిగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు ఇకనైనా పట్టించుకుని సామాన్య ప్రజలకు గతంలో మాదిరిగా నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జీపీ అధికారులు పట్టించుకోకపోతే మండల, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లుగా జీఎంపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నలబెట్ల చిన్నరాజు హెచ్చరిస్తున్నారు.



పిల్లల్లా మారి.. అల్లరి చేసి!

వాళ్లు పదో తరగతి చదివి 44 ఏళ్లవుతోంది. ఎక్కడెక్కడో సెటిల్ అయిన 1979–80 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 56 మంది ఆదివారం శాయంపేట మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులు వేముల ప్రతాప్‌రెడ్డి, బేరి యాదగిరి, సాయన్న, శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మిని పూలమాలలు, శాలువా, మెమెంటో, బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కన్వీనర్ రవికుమార్, పూర్వ విద్యార్థులు అంకేశ్వరపు సాంబయ్య, వేముల అశోక్‌రెడ్డి, పున్నం వీరారెడ్డి, కుసుమ రాజేంద్రప్రసాద్, కందగట్ల రాజేందర్, కుసుమ అశోక్, పసునూటి రమేశ్, పైడిమల్ల కోటి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

– శాయంపేట

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో నాయకులు

పరకాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ వెళ్తున్న క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పరకాల అంబేద్కర్ కూడలిలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, నాయకులు భాస్కరాచారి, సూర్యదేవర సదానందం, ఆకుల రాంబాబు, మిడిదొడ్డి నరేశ్, జనార్దన్, ఆకుల శ్రీధర్, పాలకుర్తి ప్రతాప్, ముత్యాల దేవేందర్, దామ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దామెర: మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహాదేవ్‌పూర్ పర్యటనలో భాగంగా బండి సంజయ్ మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో స్వల్ప విరామంకోసం ఆగారు. ఈ సందర్భంగా దామెర మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకులు పొడాల మధుకర్, గండు అన్వేశ్, ముఖేశ్, పరుశరామ్, చెల్పూరి రాజు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

ఆత్మకూరు : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం మహదేవపూర్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు వెళ్తుండగా.. గూడెపాడ్ సెంటర్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గురజాల శ్రీరామ్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు.. కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సదానందం శ్రీకాంత్ రెడ్డి, కల్యాణ్, రాజ్‌కుమార్, సునీల్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, సాయిరాం, శ్రీనివాస్ రెడ్డి, దిలీప్, మధుకర్, అన్వేశ్, ముఖేశ్, పరుశురాం, రాజు పాల్గొన్నారు.



పరకాల: బండి సంజయ్‌తో బీజేపీ నాయకులు

బెల్ట్ షాపులపై దాడులు

ఆత్మకూర: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కంపేట గ్రామంలో కిరాణం దుకాణాల పేరుతో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న బింగి మల్లయ్య, పెండ్లి రాజుల వద్ద రూ.26వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నేడు కేయూలో ఎన్‌పీఎస్‌పై ఓరియంటేషన్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల కోసం ఈనెల 23న మధ్యాహ్నం క్యాంపస్‌లోని పరిపాలన భవనం సెనెట్ హాల్‌లో నేషనల్ పెన్షన్ పథకంపై ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఏపీలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉదయ భాస్కర్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగుల ఆర్థిక ప్రణాళిక, పదవీ విరమణ సంసిద్ధత పెంపొందించే లక్ష్యంతో ఉదయభాస్కర్ నేషనల్ పెన్షన్ స్కీంపై విలువైన సమాచారాన్ని అందజేస్తారని తెలిపారు.

దేశహితం కోసం పనిచేసేది బీజేపీ



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

ఆత్మకూరు: దేశహితం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని ఆపార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మండల సభ్యత్వ ప్రముఖ్ ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేట గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2047 వరకు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా చేయాలనే లక్ష్యంతో ప్రధాన మోదీ పని చేస్తున్నారని తెలిపారు. బీజేపీ అధికారం చేపడితే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాశతో ఉన్న ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యులుగా చేరుతున్నారని తెలిపారు. 88000 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి బీజేపీలో సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు సముద్రాల రవి, బూత్ అధ్యక్షుడు ఇలాసారపు రత్నాకర్, బొల్లికొండ వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలి



స్నాతకోత్సవంలో అతిథులు, హెచ్ఓడీలు

హన్మకొండ కల్చరల్: ఉత్తీర్ణులైన ఫార్మసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలని, ఫార్మా ఇండస్ట్రీ, క్లినికల్ ఫార్మసీ విభాగాల్లో అప్రమత్తంగా ఉంటూ అవకాశాలు అందుకొని విజయాలు సాధించాలని వరంగల్ కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్య అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవం గ్రాడ్యుయేషన్ డే -2024ను ఆదివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినీదేవి, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాల హెచ్ఓడీలు డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బీఎస్ శరవణభవ, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ సీహెచ్ మహేష్, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పావని, గిరిజ, మాధవి, లక్ష్మీకల్యాణి, రజిని పాల్గొన్నారు.

బంధువులకు దోచిపెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే..

- టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్ గౌడ్

నయీంనగర్: బంధువులకు దోచిపెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌దేనని, బంధువులకు ఆశ్రిత పక్షపాతం పేటెంట్ హక్కులు ఆ పార్టీకే ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆది వారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకం అ మృత్ టెండర్లలో అక్రమాలు జరిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సృజన్‌రెడ్డి ఇంతకుముందు కేటీఆర్ దగ్గర కూడా పనిచేశారని, కేటీఆర్‌కు ఉన్న బినామీల్లో సృజన్ రెడ్డి ఒకరని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రహస్య మిత్రులు అనడానికి కవితకు బెయిల్ రావడమే నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ అమలు చేస్తోందని, రైతు రుణమాఫీ రాని వారి కోసం సర్వే చేసి రుణమాఫీ చేయనున్నట్లు వివరించారు. రాజకీయ దురుద్దేశంతోనే సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభ

కాజీపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 20వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రొఫెసర్ బన్న అయిలయ్య పిలుపునిచ్చారు. కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం కమ్యూనిటీ హాల్‌లో తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే, కులాల ప్రాతిపదికన పూర్తిగా పరిశీలన చేసిన తర్వాతే తుది తీర్పు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. మర్యాల కృష్ణ అధ్యక్షత వహించగా మాజీ డీఎస్పీ దామెర నర్సయ్య, బండి విజయ్‌కుమార్, కోంద్ర నర్సింగరావు, సీహెచ్.కొమ్మాలు, జంగం బాబురావు, నక్క సుదర్శన్, తండమల్ల వేణు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక



సంపత్, అధ్యక్షుడు

శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన కర్రు సంపత్ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షుడు గొరిశెట్టి సత్యనారాయణ తెలిపారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో జిల్లాలోని 14 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాచర్ల సారంగపాణి, కార్యదర్శిగా పెరుమాళ్ల ఆగస్టాన్, కోశాధికారిగా కడివెండి రమేశ్, ఉపాధ్యక్షుడిగా మియాపురం శివుడును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.